హెచ్ఎండీఏ సరికొత్త ప్రణాళిక!

హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ ముసాయిదాకు మరో మూడు నెలలు

హెచ్ఎండీఏ 2050 మాస్టర్‌ప్లాన్‌లో ప్రజా రవాణా, అర్బన్ డెవలప్‌మెంట్, మౌలిక వసతులకు ప్రాధాన్యత

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్-2050 ముసాయిదాకు మరో మూడు నెలల సమయం పట్టేలా ఉంది. ఇప్పటికే ఏడు జిల్లాల మేర విస్తరించిన మహా నగరాభివృద్ధి సంస్థ, వచ్చే 25 ఏండ్లకు అవసరమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోంది. ఇప్పటికే ఈ ప్రక్రియ మొదలు కాగా, ముసాయిదా విడుదలకు ఏజెన్సీలు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత మాస్టర్ ప్లాన్‌లోని మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు, తప్పొప్పులను సరి చేసిన తర్వాత తుది మాస్టర్ ప్లాన్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేయనుంది. ఈ ఏడాది చివరి నాటికి మాస్టర్ ప్లాన్-2050 అమలులోకి వచ్చే అవకాశం ఉందని, రూపకల్పన ప్రక్రియ వేగంగా సాగుతుందని హెచ్ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి.

అమలులో.. ఐదు మాస్టర్ ప్లాన్లు

ప్రస్తుతం, హైదరాబాద్ కేంద్రంగా ఐదు మాస్టర్ ప్లాన్లు అమలులో ఉన్నాయి. ఇందులో ఓల్డ్ మున్సిపాలిటీ, జీహెచ్ఎంసీ, ఎయిర్ పోర్టు ఆథారిటీ, సైబరాబాద్, మాస్టర్ ప్లాన్-2031 అందుబాటులో ఉండగా.., చాలా ప్రాంతాల్లో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ప్రధానంగా మాస్టర్ ప్లాన్ - 2031లో జోన్ల విషయంలో చాలా సమస్యలు నిత్యం తలెత్తుతున్నాయి. దీంతో తప్పులు సరి చేసుకునే క్రమంలో జనాలు ఎన్వోసీలు ఉంటే గానీ నిర్మాణ పనులు చేపట్టే వీల్లేకుండా పోయింది. ఆధునాతన సాంకేతికత సాయంతో గూగుల్ మ్యాపులు, స్థానిక రెవెన్యూ మ్యాపులు, విలేజ్ మ్యాపులు, ఎన్జీఆర్ఐ, ఎన్ఆర్ఎస్సీ క్రోడీకరిస్తున్నారు. ఇక నుంచి ఒకటే మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఆయా స్థానిక సంస్థలు, ఆథారిటీలు ప్రణాళికలు రూపొందించేలా మాస్టర్ ప్లాన్-2050 ఉంటుందని చెబుతున్నారు.

మూడింటికి ప్రాధాన్యత..

గ్లోబల్ సిటీ అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ - 2050లో ప్రధానంగా మూడు అంశాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చినట్లుగా తెలిసింది. ప్రజా రవాణా, పారిశ్రామిక జోన్లు, అర్బన్ డెవలప్‌మెంట్‌కు అవసరమైన మౌలిక వసతులపై దృష్టి పెట్టారు. అదే విధంగా ఓఆర్ఆర్, ట్రిపులార్ మధ్య రేడియల్, గ్రిడ్ రోడ్లు, ఇంటర్నల్ రహదారులు, మెట్రో విస్తరణ, జాతీయ రహదారులు, విమానాశ్రయంతో అనుసంధానం, జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణా అభివృద్ధికి వీలు ఉండేలా మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరుగుతుందని తెలిపారు. 2008లో తెచ్చిన మాస్టర్ ప్లాన్‌లో ఉన్న తప్పుల కారణంగా ఇప్పటికీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా మాస్టర్ ప్లాన్ సిద్ధం అవుతుందని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. కొత్త మాస్టర్ ప్లాన్‌లో నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, వికారాబాద్ జిల్లాలోని పలు మండలాలు కూడా కలుపుతారని తెలిసింది.

30న జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన ఈ నెల 30వ తేదీన సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవంగా ప్రతి మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) జరగాల్సి ఉంది. గత జూలై 6న జరిగిన 9వ పాలక మండలి (సర్వసభ్య సమావేశం) అక్టోబరులో జరపాల్సి ఉంది. కానీ, ఐదు నెలలు గడిచినా సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు కమిషనర్, మేయర్ సిద్ధపడలేదు. ఎట్టకేలకు ఈ నెల 30న జరపాలని నిర్ణయించి, కార్పొరేటర్లు సమాచారం అందజేశారు. 150 ప్రశ్నలతో పాటు స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేక చర్చ జరగనుంది. అన్నింటి కంటే ప్రధానంగా మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మాన అంశం ఆసక్తికరంగా మారింది.

ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్ల గడువు పెంపు..

జూబ్లీహిల్స్, జనవరి 23: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో అడ్మిషన్లకు మరో మూడు రోజులు గడువు పొడిగించారు. పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు 2024-25 విద్యా సంవత్సరంలో చివరి అవకాశంగా ఈ నెల 27 నుంచి 29 వరకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు టీఓఎస్ఎస్ డైరెక్టర్ పీవీ శ్రీహరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అర్హాంతరంగా చదువు ఆపేసిన వారికి అండగా నిలుస్తూ విద్యాధికులను తయారుచేసే లక్ష్యంతో ఓపెన్ స్కూల్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సొసైటీలో పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో తత్కాల్ స్కీం లో భాగంగా మరో అవకాశాన్ని కల్పిస్తున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్, మీ సేవలతో పాటు స్థానిక పాఠశాలల్లో నేరుగా ఇవ్వవచ్చని తెలిపారు.

మహింద్ర కార్ల షోరూమ్‌లో అగ్ని ప్రమాదం

కొండాపూర్, జనవరి 23: మహింద్ర కార్ల షోరూమ్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. కొత్తగూడలోని మహింద్ర కార్ల షోరూమ్‌లో గురువారం రాత్రి 10:30 గంటల ప్రాంతంలో షోరూమ్ నేమ్ బోర్డులో నుంచి దట్టమైన పొగలు రావడం గమనించిన సెక్యూరిటీ, స్థానికులు పోలీసు, ఫైర్ స్టేషన్లకు సమాచారం అందించారు. స్వల్ప సమయంలోనే మంటలు అంటుకుని, ఒక్కసారిగా ఎగిసిపడడంతో చుట్టు ప్రక్కల వారు, వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. మాదాపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని తీవ్రంగా కృషి చేసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాద తీవ్రత పెరుగుతుందనే ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పక్కనే ఉన్న ఓయో హోటల్‌ను ఖాళీ చేయించారు. కాగా, ప్రమాదంలో 15 కార్లు దహనమవ్వగా, వివరాలు తెలియాల్సి ఉంది. కొత్తగూడ ప్రధాన రహదారిలో మహింద్ర కార్ల షోరూమ్ ఉంది. అగ్ని ప్రమాదం జరగడంతో నాలుగు ఫైర్ ఇంజన్లు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేస్తుండగా, రహదారిపై భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

ఎమ్మెల్యే పద్మారావుకు పరామర్శల వెల్లువ

ఎమ్మెల్యే పద్మారావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి తదితరులు

సికింద్రాబాద్, జనవరి 23: సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆనారోగ్యానికి గురయ్యారనే విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు టకారా బస్తీలోని ఆయన నివాసానికి తరలివచ్చి పరామర్శిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు క్యూకడుతున్నారు. డాక్టర్లు వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలన్నా వీలు కావడం లేదు. కాగా, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కంటోన్మెంట్ సీనియర్ నాయకుడు గజ్జెల నగేశ్‌లతో పాటు పజ్జన్న అభిమానులు, పార్టీలకు అతీతంగా ఆయన నివాసానికి తరలి వచ్చి, పరామర్శిస్తున్నారు. దేవుని కృప, అభిమానులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు ప్రార్థనల వల్ల తాను పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఉన్నానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గురువారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పద్మారావు గౌడ్‌కు మాజీ ఎంపీ పరామర్శ

కంటోన్మెంట్, జనవరి 23: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్‌ను ఆయా కార్పొరేషన్ల మాజీ చైర్మన్‌లతో కలిసి రాజ్యసభ మాజీ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ పరామర్శించారు. ఇటీవల కుటుంబంతో సహా ఉత్తరాఖండ్ పర్యటనకు వెళ్లిన పద్మారావు గౌడ్‌కు గుండె పోటు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లి అత్యవసర చికిత్స చేయించారు. దీంతో ఆయనకు ప్రాణాపాయం తప్పినట్టు అయ్యింది. అనంతరం ఆయనను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఈ క్రమంలో గురువారం సంతోష్ కుమార్ బీఆర్ఎస్ నేతలతో సహా పద్మారావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్‌లు గజ్జెల నగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో సహా పలువురు, పద్మారావు ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు రాజీవ్ సాగర్, బాలరాజు యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ లీడర్లు ఉన్నారు.

ప్రజల మనిషి త్వరగా కోలుకోవాలి: ఎమ్మెల్యే మర్రి

అనారోగ్యంతో ఉన్న మాజీ మంత్రి పద్మారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జనవరి 23: ప్రజల మనిషి మాజీ మంత్రి పద్మారావు త్వరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి పద్మారావును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం పరామర్శించారు.

మాజీ మంత్రుల.. పరామర్శ

ఎమ్మెల్యే పద్మారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు.



సికింద్రాబాద్ నియోజకవర్గ నేతలు.



పరామర్శిస్తున్న జోగినపల్లి సంతోష్, దేశపతి శ్రీనివాస్ తదితరులు

సికింద్రాబాద్, జనవరి 23: మోండా మార్కెట్‌లోని తన నివాసంలో కోలుకుంటున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ ను గురువారం పలువురు నేతలు కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, డాక్టర్ లక్షారెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, సీనియర్ నేతలు స్వామి గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, దేవి ప్రసాద్, గజ్జెల నగేశ్, ఎర్రోల్ల శ్రీనివాస్, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ శ్రీలత, నేతలు నాగులురి సాయి బాబా, వల్లూరపు శ్రీనివాస్‌లతో పాటు ఇతర నాయకులు క్రిష్ణ, పరిటాల విజయ్ కుమార్, చిరంజీవి రాజు, శశిరేఖ, బుపిన్‌లతో పాటు బీఆర్ఎస్, భాజపా, కాంగ్రెస్ పార్టీ లకు చెందిన పలువురు నేతలు పద్మారావు గౌడ్ ను పరామర్శించారు.

హ్యుండాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారు విడుదల

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్‌లోని జేఎస్‌పీ హ్యుండాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారును గురువారం మార్కెట్లోకి విడుదల చేసిన బిగ్ బాస్ ఫేం సోనియా ఆకుల. కార్యక్రమంలో హ్యుండాయ్ టీఎస్ఎం సయ్యద్ అన్వర్ హుస్సేన్, యండీ గోకుల్, పృథ్వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో త్వరలో పెడియాట్రిక్ ఫిట్స్ విభాగం

ఖైరతాబాద్, జనవరి 23: నిమ్స్ దవాఖానలో త్వరలోనే పెడియాట్రిక్ ఫిట్స్, రుమటాలజీ విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ఓ ప్రకటనలో తెలిపారు. రోటరీ రూ.2 కోట్ల సాయంతో ఫిట్స్ విభాగాన్ని ప్రారంభించుకోబోతున్నారు. అందు కోసం ప్రత్యేక వార్డులను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కరుణాకర్ రెడ్డి తదితరులు

ఖైరతాబాద్, జనవరి 23: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి కోరారు. ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా గురువారం కలిసిన సందర్భంగా యూనియన్ డైరీ, క్యాలెండర్లను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 1999 - 2004 మధ్యలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్, జీపీఎఫ్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులను డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ద్వారా చేపట్టాలన్నారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్, ప్రభాకర్ రావు, ఈశ్వరయ్య గౌడ్, కుమారస్వామి, సాంబ శివరావు, బాలరాజు, ఇమాన్యుయేల్ రావు, సురేశ్, హరిహరణ్, వేద ప్రకాశ్, నిత్య కల్యాణి, కల్పన, అశోక్, రమేశ్, భాను రేఖ పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కు బయట ఎంఎల్ పార్కింగ్ షురూ

- ప్రైవేటు వ్యక్తులకు జీహెచ్ఎంసీ స్థలం కట్టబెట్టారని ఆరోపణలు
- ఆగమేఘాల మీద పనులు ప్రారంభించిన సంస్థ

నెల రోజుల క్రితం జీహెచ్ఎంసీ నాటించిన పూల మొక్కలు

బంజారాహిల్స్, జనవరి 23: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు బయట జీహెచ్ఎంసీకి చెందిన పార్కింగ్ స్థలంలో మల్టీ లెవల్ పార్కింగ్ భవన నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌కు వెళ్లే రోడ్డులో వాకర్లు వాహనాలు పార్క్ చేసుకునే స్థలంలో పీపీపీ మోడల్‌లో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణం కోసం ఇటీవల జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కాగా, ఇప్పటికే ఈ పార్కింగ్ స్థలంలో సుమారు 30 కార్లకు స్థలం ఉండగా, ప్రైవేటు సంస్థకు స్థలాన్ని లీజుకు ఇవ్వడం ఏంటి? అని వాకర్లు ప్రశ్నిస్తున్నారు. మూడు నెలల క్రితం స్టాండింగ్ కమిటీలో ప్రతిపాదనలు పెట్టినప్పుడు తిరస్కరించారు. అయితే, ఉన్నత వర్గాల నుంచి ఒత్తిళ్లు రావడంతో ఆగమేఘాల మీద మల్టీ లెవల్ పార్కింగ్ భవనానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించింది. అయితే, ఈ ప్రాజెక్టును కేవలం ప్రకటనల ఆదాయం కోసం మాత్రమే నిర్మిస్తున్నారని, కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్లు తప్ప వేరేవాళ్లు ఎవరూ తమ వాహనాలు ఇక్కడకు వచ్చి పార్కింగ్ చేసే పరిస్థితి లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఈ స్థలంలో ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాల కోసం చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా బ్యాటరీ చార్జింగ్ పాయింట్లు నిరుపయోగంగా మారనున్నాయి. నెలరోజుల క్రితం కేబీఆర్ పార్కు బయట జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సుందరీకరణ పనుల్లో భాగంగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పూల మొక్కలు నాటేందుకు నిర్మాణాలు చేశారు. ఇప్పుడు మల్టీ లెవల్ పార్కింగ్ కోసం జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన పూల మొక్కలు ధ్వంసమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రైవేటు వ్యక్తులకు ప్రయోజనం కలిగించేందుకు కేబీఆర్ పార్కు బయట సుమారు 1000 గజాల స్థలాన్ని లీజు పేరుతో అప్పగించడంపై కేబీఆర్ పార్కు వాకర్లు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెట్రో ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు

కారిడార్-3లో ఆధునీకరణ పనులు

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో సంస్థ స్టేషన్ల వద్ద ఉండే ఫుట్‌పాత్‌ల ఆధునీకరణపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఫేజ్-1లో కారిడార్-3లో పలు స్టేషన్ల వద్ద దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లను ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టింది. దాదాపు రూ.37 లక్షల అంచనా వ్యయంతో సికింద్రాబాద్ నుంచి బేగంపేట్ మార్గం, మధురానగర్ నుంచి రాయదుర్గ్ మార్గంలో పనులు చేపట్టనున్నారు. పెరుగుతున్న మెట్రో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా నగరంలో మౌలిక వసతులను కల్పనలో భాగంగానే మరమ్మతులు చేయనుంది. వీటి మరమ్మతులు, నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించనుంది. మెట్రో స్టేషన్ నుంచి బయటకు రాగానే మెరుగైన నడక మార్గాలను అభివృద్ధి చేయనున్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 23(నమస్తే తెలంగాణ): రజకులను ఎస్సీలుగా గుర్తించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. రజకులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్యకు చెందిన క్యాలెండర్‌ను గురువారం హైదరాబాద్‌లో చాడ వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, 18 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని చెప్పారు. తెలంగాణలోనూ వీరిని ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వృత్తి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ, ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, ఉపాధ్యక్షులు పగిళ్ల జోజి, కార్యదర్శి గోరుగంటి కృష్ణ, దండు నిరంజన్, ఉడుతల మల్లేశ్ పాల్గొన్నారు.



హుస్సేన్ నాయక్‌ను వర్సిటీకి ఆహ్వానిస్తున్న వీసీ జానయ్య తదితరులు

గిరిజన వర్గాలపై వివక్ష తగదు

- జాతీయ కమిషన్ సభ్యులు హుస్సేన్

వ్యవసాయ యూనివర్సిటీ , జనవరి 22: కొన్నేండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గిరిజన సామాజిక వర్గ ప్రజలకు తగు న్యాయం చేసేందుకే ఎస్టీ కమిషన్ ఏర్పడిందని, కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యులు జటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సమీపంలోని ఎక్స్టెన్షియన్ సమావేశపు మందిరంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. విద్యపై రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నంత వివక్ష దేశంలో ఎక్కడా లేదన్నారు. ప్రతి పౌరునికి విద్య, వైద్యం సకాలంలో అందించాల్సిన హక్కు ఉన్నా, పాలకులు, అధికారుల అవగాహనాలోపంతో ప్రజలకు ప్రధానంగా, ఎస్టీలకు దూరమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు ఏటా పెంచుకుంటున్నా, గిరిజన ఉద్యోగుల, విద్యార్థుల మెనూ మాత్రం పెరగదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని ఉన్నా, ఎక్కడా అమలు కావడం లేదన్నారు. మంత్రీ, క్వాటర్లీ సమావేశాలకు ఎగనామం పెట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం, ప్రయివేటు విశ్వవిద్యాలయాలకు అనుమతులు ఇస్తూ, సామాన్యులకు విద్యను, వైద్యాన్ని దూరం చేశాయని మండిపడ్డారు. 2017 నుంచి బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయక పోవడంతో సీనియర్స్ ప్రమోషన్లు, కొత్త ఉద్యోగాలు లేకుండాపోయాయన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ భూములు ఆక్రమణకు గురయ్యాయని, పాలకులు, ఉన్నతాధికారులు కలిసి ప్రైవేటుకు అప్పజెప్పడం విడ్డూరమన్నారు. ఈ ఒక్కరోజు వీరితో ఉంటేనే దాదాపు 200లకు పైగా ఫిర్యాదులొచ్చాయని,15 రోజుల వ్యవధిలో వీటిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

దివ్యాంగుల పునరావాస పథకానికి దరఖాస్తులు

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): దివ్యాంగుల ఉపాధి, పునరావాస పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా దివ్యాంగుల శాఖ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. బ్యాంక్ లింకేజీ అవసరం లేకుండా నేరుగా రూ.50 వేల ఆర్థిక సాయం అందిచనున్నట్టు తెలిపింది. హైదరాబాద్ జిల్లాకు 16యూనిట్ల ద్వారా రూ. 8 లక్షల సబ్సిడీ మంజూరైనట్టు పేర్కొంది. ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తుకు అవకాశంగా నిర్ణయించినట్టు వెల్లడించింది. www.tgobmms.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

పదిలో మెరుగైన ఫలితాలు రావాలి: ఏసీ

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): పది పరీక్షలకు మరో 60 రోజులే ఉందని, విద్యార్థులందరూ ప్రణాళికాబద్ధంగా చదివి విజయం సాధించాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ కదిరవన్ అన్నారు. మహేంద్రహిల్స్‌లో గురువారం బీసీ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అనంతరం, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుంటుంది

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, చిత్రంలో మణికంఠ, తదితరులు

కాచిగూడ, జనవరి 23: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇష్టానుసారంగా దోచుకుంటుందని, అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఒక్క బీసీకి రుణాలు ఇవ్వలేదని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ధ్వజమెత్తారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ ఆధ్వర్యాన కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో గురువారం సదస్సును నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ వాదం బలంగా ఉందని, వచ్చేది బీసీల రాజ్యమేనని వెల్లడించారు. బీసీల కులవృత్తుల వారికి బ్యాంకులతో నిమిత్తం లేకుండా నేరుగా బీసీ కార్పొరేషన్లు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశ్రామీకరణ ఆదరణ తగ్గడంతో రాష్ట్రంలో బీసీ కులాల వారికి ఉపాధి కరువైందని ఆరోపించారు. బీసీ కుల వృత్తుల వారికి యంత్రాలు కొనుగోలు చేయడానికి రూ.50 లక్షల వరకు రాయితీని అందజేయాలని డిమాండ్ చేశారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ నినాదం బలంగా ఉందని, అందుకు రాజ్యాంగాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. బీసీలు రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, తెలంగాణ ఉద్యమం లాగా బీసీ ఉద్యమం వచ్చినప్పుడే బీసీల బతుకులు మారుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో గొరిగె మల్లేశ్, నీలం వెంకటేశ్, జి.అంజి, వేముల రామకృష్ణ, నందగోపాల్, మోడీ రామ్‌దేవ్, రాజు, భాస్కర్, రఘుపతి, ప్రవీణ్ కుమార్, నిఖిల్, రవి యాదవ్, బాలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.